సాక్షి ఒడిశా

ఆదివారం । 14 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,25,930, బంగారం 200 మిల్లీ గ్రాములు వెండి 40 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



రాజీయే.. రాజమార్గం

● రాష్ట్రవ్యాప్తంగా మెగా లోక్ అదాలత్

- 8లో.



కొరాపుట్‌లో రీజనల్ జుడీషియల్ అకాడమీ

- 8లో.

న్యూస్‌రీల్

కొండచిలువ కలకలం



హెల్ప్‌లైన్ సిబ్బంది బంధించిన కొండచిలువ

బరంపురం: నగర శివారు పాల్లిగుమరా గ్రామంలో శుక్రవారం రాత్రి 10అడుగుల కొండచిలువ చొరబడి గ్రామస్తులను ఆందోళనకు గురిచేసింది. స్థానికుల సమాచారంతో స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకు చెందిన సిబ్బంది ఆశిరాజ్ చాకచక్యంగా సర్పాన్ని బంధించారు. అనంతరం దిగపండి అటవీశాఖ అధికారుల సమక్షంలో చందుడిదెవ్ అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.

రథాయాత్రకు రంగం సిద్ధం



రథ చక్రాలకు రంగులు అద్దుతున్న కళాకారుడు

రాయగడ: ఈ ఏడాది జూన్ 20న జరగనున్న రథాయాత్రకు రంగం సిద్ధమవుతోంది. ఏటా రథాన్ని కొత్తగా నిర్మిస్తున్న నేపథ్యంలో ఈసారి కూడా రథం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. స్థానికంగా ఉన్న వడ్రంగులను రప్పించిన జిల్లా యంత్రాంగం పనులు ప్రారంభించారు. రథ చక్రాల తాయారీ, రంగుల అద్దడం వంటి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది రథయాత్ర కోసం సుమారు రూ.12 లక్షల నిధులు కేటాయించినట్లు తహసీల్దార్ తపస్‌రాత్ తెలిపారు. ఇందులో భాగంగా 9రోజుల పాటు జరిగే యాత్రలో భాగంగా గుండిచా మందిరంలో నిలిపే దేవతామూర్తుల పూజా కార్యక్రమాల నిమిత్తం సుమారు రూ.5 లక్షలు వెచ్చించేందుకు నిర్ణయించామని వెల్లడించారు. అలాగే యాత్ర జరిగే రోజుల్లో దుకాణాలు ఏర్పాటు చేసే వారి నుంచి దాదాపు రూ.5 లక్షల ఆదాయం సమకూరే అవకాశం ఉందని వివరించారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన గంజాయి, నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

బరంపురం: స్థానిక నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 150కిలోల గంజాయిని బరంపురం ఎక్సైజ్ విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారి రామచంద్ర మహంతి అందించిన సమాచారం ప్రకారం కొందమాల్ జిల్లా, దరింగబడి నుంచి బరంపురం నగరానికి ఆటోలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు బరంపురం మార్గంలో శనివారం రెక్కీ నిర్వహించిన సిబ్బంది, వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. అటుగా వస్తున్న ఆటోను సోదా చేయగా, బస్తాల్లో 150కిలోల గంజాయి బయటపడింది. దీంతో ఆటోతో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

ప్రమీలా మల్లిక్‌కు అదనపు బాధ్యతలు



మంత్రి ప్రమీల మల్లిక్

భువనేశ్వర్: రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ మంత్రి ప్రమీలా మల్లిక్‌కు పాఠశాలలు, సామూహిక విద్య, కార్మిక, ఉపాధి, బీమా విభాగాల అదనపు బాధ్యతలు కేటాయించారు. ఇద్దరు సహాయ మంత్రులు సమీర్‌రంజన్ దాస్, శ్రీకాంత సాహు తమ పదవులకు శుక్రవారం రాజీనామా చేశారు. సంస్థాగత కార్యకలాపాలకు పూర్తి సమయం కేటాయించేందుకు తాము రాజీనామా చేసినట్లు ఇరువురూ తెలిపారు. అలాగే వ్యక్తిగత కారణాలతో తాను కూడా రాజీనామా చేసినట్లు రాష్ట్ర శాసనసభ స్పీకర్ విక్రమ్ కేశరి అరూఖ్ వెల్లడించారు.

ట్రక్కు ఢీకొని బాలుడి మృతి

పర్లాకిమిడి: జిల్లా కేంద్రానికి సమీపంలోని రాణిపేట గ్రామంలో ట్రక్కు ఢీకొన్న ఘటనలో బాలుడు మృతిచెందాడు. గైబ నుంచి పర్లాకిమిడి వెళ్తున్న బైక్‌ను ట్రక్కు ఢీకొనగా, వెనుక కూర్చున్న జస్మంత్ గమాంగొ(15) వాహనం కిందపడి ప్రాణాలు కోల్పోయారు. దీంతో బాధిత గ్రామానికి గైబ, రాణిపేట వాసులు రోడ్డుపై కూర్చుని ఆందోళనకు దిగారు. పర్లాకిమిడి పోలీసులు అక్కడకు చేరుకుని, ట్రక్కు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నారు.

ఝార్సుగుడలో శంఖారావం

- ఉప ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థి దీపాలి దాస్ ఘన విజయం
- మెజార్టీలో తండ్రి కిషోర్ దాస్‌ను మించిన తనయ
- సమీప ప్రత్యర్థిపై 48,619ఓట్ల ఆధిక్యతతో గెలుపు
- విజేతకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం నవీన్ పట్నాయక్







దీపాలి దాస్ విజయసంకేతం



టొంకొధొరొ త్రిపాఠి(బీజేపీ)



తరుణ్ పాండే(కాంగ్రెస్)

భువనేశ్వర్/సాక్షి డెస్క్: ఝార్సుగుడ నియోజకవర్గ అధికార బిజూ జనతాదళ్ కైవసం చేసుకుంది. బీజేడీ అభ్యర్థిగా బరిలోకి దిగిన దీపాలి దాస్ సమీప ప్రత్యర్థిపై 48,619 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించింది. దీపాలికి ఆమె తండ్రి, దివంగత మంత్రి నవకిషోర్ దాస్ కంటే 8,578 ఓట్లు అధికంగా పోలవ్వడం విశేషం. 2019లో కిషోర్‌దాస్ సాధించిన ఓట్ల కంటే 5శాతం ఎక్కువ వచ్చాయి. అలాగే 2019లో దినేష్ జైన్ సాధించిన ఓట్లు కంటే 5,556 ఓట్లు(3.2శాతం) ఎక్కువగా బీజేపీకి చెందిన టొంకొధొరొ త్రిపాఠి పొందారు. మరోవైపు గత గణాంకాలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీ 8.5శాతం ఓట్లు(14,327) కోల్పోయింది. ఇవన్నీ విజేతగా నిలిచిన బీజేడీ, సమీప ప్రత్యర్థి బీజేపీ ఖాతాలో పడ్డాయి. కాంగ్రెస్ అభ్యర్థి తరుణ్‌పాండే కేవలం 4,473ఓట్లు మాత్రమే సాధించి, డిపాజిట్ కోల్పోయారు.

పార్టీల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు		
అభ్యర్థి	పార్టీ	పోలైన ఓట్లు
టొంకొధొరొ త్రిపాఠి	బీజేపీ	58384
తరుణ్‌పాండే	కాంగ్రెస్	4,473
దీపాలి దాస్	బీజేడీ	1,07003
జన్మరొహిదాస్	ఒడిశా ప్రగతిదళ్	716
మనీష్ శర్మ	ఒడిశా జనతాపార్టీ	284
మహేంద్ర పట్నాయక్	కళింగసేన	425
బిజయ్‌కుమార్ జలన్	ఇండిపెండెంట్	454
మహేంద్ర లోహా	ఇండిపెండెంట్	828
జ్ఞానేంద్ర బెహరా	ఇండిపెండెంట్	972
నోటా		2,073

విజయం నాన్నదే..

ఉప ఎన్నికల్లో లక్షకు పైగా ఓట్లతో దీపాలీ దాస్ విజయం సాధించింది. గెలుపు అనంతరం ఆమె స్పందించారు. విజయాన్ని తన తండ్రి, దివంగత నవకిషోర్ దాస్‌కు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. 'ఈ విజయం నాది మాత్రమే కాదు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ది. నాన్న కిషోర్ దాస్‌ది. కన్న బిడ్డగా ఆదరించిన ప్రజలది. ఈరోజు చాలా సంతోషంగా ఉన్నాను. ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. బిజూ జనతాదళ్ అధిష్ఠానానికి చెందిన సీనియర్ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు. నియోజకవర్గ అభివృద్ధికి నాన్న కలగన్న వాటిని నెరవేర్చేందుకు కృషి చేస్తా. ప్రజలు కష్ట, సుఖాల్లో అన్నయ్య కలిసి అండగా ఉంటా'నని భావోద్వేగానికి గురయ్యారు.

నాలుగో స్థానంలో నోటా..!

ఝార్సుగుడ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఘన విజయం సాధించిన బీజేడీ అభ్యర్థి దీపాలి దాస్‌కు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి ప్రత్యక్షంగా అభినందనలు తెలిపారు. ఈ విజయంతో ఝార్సుగుడ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. బీజేడీ అభ్యర్థిని భారీ ఆధిక్యంతో గెలిపించిన ఝార్సుగుడ ఓటర్లకు కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదిలా ఉండగా.. మొత్తం 19రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగ్గా.. ప్రతి రౌండ్‌లోనూ దీపాలీ దాస్ స్పష్టమైన ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. ఆమెకు 1,07,003 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి టొంకొధొరొ త్రిపాఠికి 58,384 ఓట్లు సాధించారు. పోటీలో మొత్తం 9మంది ఉండగా, బీజేడీ, బీజేపీ, కాంగ్రెస్, తరువాతి స్థానంలో నోటాకు అధికంగా 2,073 ఓట్లు పోలయ్యాయి. మిగతా వారంతా కనీసం వెయ్యి ఓట్ల మార్కు కూడా దాటలేకపోయారు. అలాగే కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన తరుణ్‌పాండే ఓ ఒక్క రౌండ్‌లోనూ వెయ్యి మార్కును దాటకపోగా.. కనీస ప్రభావం చూపలేకపోయారు.



ఎన్నికల ర్యాలీలో భాగంగా ఓటర్లతో మమేకమవుతున్న దీపాలి దాస్

రౌండ్లు వారీగా ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోలైన ఓట్లు			
రౌండ్లు	దీపాలి దాస్ (బీజేడీ)	టొంకొధొరొ త్రిపాఠి(బీజేపీ)	తరుణ్‌పాండే (కాంగ్రెస్)
1	5944	3238	123
2	5312	3508	140
3	6287	3164	258
4	6072	3521	305
5	6435	3068	329
6	5559	3359	784
7	4611	2116	420
8	7003	3583	326
9	4557	2633	138
10	5870	3976	243
11	5908	3222	142
12	7563	4248	261
13	5863	3053	195
14	6734	2868	143
15	5603	3639	166
16	5005	2735	160
17	6459	3114	143
18	5819	3100	187
19	399	239	10
మొత్తం	1,07003	58384	4,473

విజిలెన్స్‌కు చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

- ఇంటి పట్టాకు రూ.5 వేలు డిమాండ్ చేసిన ఉద్యోగి



ఆర్‌ఐ స్వాతి సుచరిత పాత్రొ



ఛత్రపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

బరంపురం: విజిలెన్స్ వలకు మరో అవినీతి ఉద్యోగి చిక్కారి. గంజాం జిల్లా ఛత్రపూర్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న స్వాతి సుచరిత పాత్రొ రూ.5 వేలు లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికార్లకు పట్టుబడ్డారు. బరంపురం విజిలెన్స్ ఎస్పీ మాయాధర్ స్వాయి తెలిపిన సమాచారం ప్రకారం గంజాం జిల్లా ఛత్రపూర్ తహసీల్ పరిధిలోని కపిలేశ్వర్ వీధిలో నివాసం ఉంటున్న దిలీప్‌కుమార్ సాహు తన పేరున ఇంటి కావాలని అధికారులను సంప్రదించారు. అయితే పట్టా మంజూరు చేసేందుకు ఆర్‌ఐ స్వాతి రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు పథకం ప్రకారం ఆమె లంచం తీసుకుంటుండగా అధికారులు అరెస్ట్ చేశారు. ఆధారాలు సేకరించిన అనంతరం కోర్టుకి తరలించినట్లు మాయధర్ వివరించారు.

కాంగ్రెస్ లోకి చేరికలు



కండువా వేసి, పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉలక



కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్యతో ఎంపీ సప్తగిరి

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి పాత్రాగుడ పంచాయతీ బొరిగుడ గ్రామంలో కాంగ్రెస్‌లో మిశ్రణ పర్వం శనివారం నిర్వహించారు. కొరాపుట్ లోక్‌సభ సభ్యుడు సప్తగిరి శంకర ఉలక నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అధికారంలో ఉన్న బీజేడీ, బీజేపీ లకు చెందిన 100మంది కార్యకర్తలు హస్తం తీర్థం పుచుకున్నారు. వారికి పార్టీ కండువాలు వేసిన ఉలక.. సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ఇది నాంది పలుకుతుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 2 దశాబ్దాలకు పైగా పాలన సాగిస్తున్న నవీన్ సర్కార్‌పై జనం విసుగెత్తి ఉన్నారని, ఇది తమ గెలుపును ప్రభావితం చేస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, బొరిరగుడ, ఉపొరిఛెలినాలో, నువాసాహి, పాలమ తదితర గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు.

కర్ణాటక విజయంపై హర్షం..

కొరాపుట్: కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక హర్షం వ్యక్తంచేశారు. శనివారం వెల్లడైన ఫలితాల అనంతరం ఆయన ప్రకటన విడుదల చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి చెక్ పట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోష్యం చెప్పారు. సప్తగిరి కర్ణాటక ఎన్నికల్లో భాగంగా ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కలిసి వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఏఐసీసీ వ్యూహకర్తల కమిటీలో ఉన్న ఆయన.. కర్ణాటక ఎన్నికల చిత్రాలను మీడియాతో పంచుకున్నారు.

కొరాపుట్‌లో డీజీపీ పర్యటన



బీఎస్ఎఫ్ శిబిరానికి చేరుకుంటున్న డీజీపీ సునీల్ బన్సాల్

- జిల్లాలో మావోయిస్టుల ప్రభావంపై సమీక్ష



ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ, పోలీసు, బీఎస్ఎఫ్ అధికారులు

కొరాపుట్: రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ సునీల్ బన్సాల్ కొరాపుట్ జిల్లాలో శనివారం పర్యటించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని బీఎస్ఎఫ్ బెటాలియన్ శిబిరానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర ఇంటిలిజెన్స్ డైరెక్టర్ సంజీవ్ పండా, ఐజీ సత్యబ్రత బొయి హాజరయ్యారు. ఈ సందర్భంగా దండకారణ్యం ఆంధ్రా–ఒడిశా బోర్డర్(ఏఓబీ)లో మావోయిస్టుల ప్రభావంపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అత్యంతం రహస్యంగా జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి పోలీసు ఉన్నతాధికారులు, బీఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు. మావోయిస్టుల కదలికలు, దళాల పనితీరు, లొంగుబాట్లు కోసం చర్చలు తదితర విషయాలపై చర్చించారు. చేరుకున్నారు. సమావేశంలో దక్షిణాంచల్ రేంజ్ డీఐజీ రాజేష్ పండిట్, బీఎస్ఎఫ్ డీఐజీ సైలేష్‌కుమార్, కొందమాల్ జిల్లా ఎస్పీ సువేందుకుమార్ పాత్రొ, కొరాపుట్ ఎస్పీ అనుభవ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలపై ఏడీఎం దర్యాప్తు

- బాధితురాలికి తిరిగి డబ్బులు చెల్లించిన మోసగాళ్లు



తనకు జరిగిన మోసాన్ని వివరిస్తున్న బాధితురాలు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి చంచాగుడ పంచాయతీ నియమగిరి పర్వత ప్రాంతంలోని బలపాయి గ్రామానికి చెందిన డొంగిరియ మహిళ టిమి పుషిక నుంచి మోసపూరితంగా కాజేసిన రూ.7,500 లను అధికారులు తిరిగి చెల్లించారు. అధికారులకు డబ్బులు ఇవ్వాలని ఆమె నుంచి ఇద్దరు ఉద్యోగులు డబ్బులు కాజేసిన విషయంపై బాధిత మహిళ నేరుగా ఏడీఎం ధర్మానంద బెహరాను కలిసిన విషయం తెలిసిందే. దీనిపై ఆయనే స్వయంగా దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం టిమి పుషిక నివసిస్తున్న బలపాయి గ్రామానికి వెళ్లి అక్కడి గ్రామస్తులతో మాట్లాడారు. నిజానిజాలు తెలుసుకున్నారు. బిసంకటక్‌లోని ఒపిలిపి, డీకేడీఏ సంస్థల్లో పనిచేసే ఇద్దరు సిబ్బందిని పిలిపించి, నిలదీశారు. డబ్బులు తీసుకున్నట్లు వారు అంగీకరించడంతో నగదును తిరిగి ఇప్పించారు. ఈ విషయంలో మోసగించిన రమేష్ నల్ల, సహదేవ్ లను ఏడీఎం మందలించి వదిలేశారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తప్పయ్యింది.. క్షమించండి

డొంగిరియా మహిళ టిమి పుషిక వ్యాపారం చేసుకునేందుకు ఎపిలిపి సంస్థలో దరఖాస్తు పెట్టుకోగా, వ్యాపారం నిమిత్తం రూ.27 వేలు మంజూరయ్యాయి. ఈ మొత్తంలో రూ.7,500 లను అదే సంస్థలో పనిచేసే రమేష్, సహదేవ్ మాయ మాటలు చెప్పి కాజేశారు. ఇదే విషయమై బాధిత మహిళ ఏడీఎంను కలిసి వివరించింది. విషయం తెలుసుకున్న సిబ్బంది.. శనివారం తెల్లవారే తన ఇంటికి వచ్చి 'నిన్ను మోసం చేసి తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేస్తాం.. మమ్మల్ని క్షమించు' అని ప్రాధేయ పడ్డారని ఆమె విలేకర్లకు వివరించింది. తనలాంటి ఎంతోమందిని మోసగిస్తున్న ఇటువంటి వారికి తగిన బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతోనే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లానని స్పష్టంచేసింది.



టిమి పుషికతో మాట్లాడుతున్న ఏడీఎం బెహరా

క్లుప్తంగా

నీటి వనరుల సంరక్షణపై శిక్షణ



మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న దేవసుందర్ మహాపాత్రో

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని పురపాలక శాఖ కాన్ఫరెన్స్ మందిరంలో వివిధ స్వయం సహాయక బృందాలు, గ్రామ సాథీలకు నీటి వనరుల సంరక్షణపై శిక్షణ శిబిరం శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలాశెఠి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో మున్సిపల్ ఈఓ వనమాలి శత్పతి, నీటి వనరుల పునరుజ్జీవ సలహాదారు దేవసుందర్ మహాపాత్రో ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని చెరువులు, కొండలపై నుంచి వృథాగా పోతున్న నీటి వనరులను సంరక్షించుకునేందుకు ఇంగుడు గుంతలు, నీటి కుంటలు ఏర్పాటు చేయాలని సూచించారు. జలశయాల మరమ్మతుకు మహిళా సంఘాలే గుత్తేదారుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర నీటి వనరుల మిషన్, అమో పోఖోరీ(మన చెరువులు) ప్రత్యేక కార్యదర్శి సాగరిక పట్నాయక్ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ, శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, చేపల పెంపకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, మున్సిపల్ ఇంజినీర్ సంజీవ్ సంపతి, స్టేట్ మిషన్ మేనేజర్ ప్రసన్న మహారాణ తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు



ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్

రాయగడ: పట్టణంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్-23 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. 11వ ఒడిశా మూయాయి-థాయ్ బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో 15 జిల్లాలకు చెందిన 120మంది క్రీడాకారులు హాజరయ్యారు. రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాశానికి దోహదపడతాయన్నారు. బాక్సింగ్ వంటి అంతర్జాతీయ క్రీడను రాయగడలో ప్రప్రథమంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. 2రోజులు జరగనున్న ఈ పోటీలు ఆదివారం ముగుస్తాయని ఆర్గనైజింగ్ అధ్యక్షుడు రాజేష్ పట్నాయక్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్, ఏడీఎం (పబ్లిక్ హెల్త్) డాక్టర్ లోక్‌నాథ్ రాజు, జిల్లా పౌరసంబంధాలశాఖ అధికారి బసంతకుమార్ ప్రధాన్ అతిథులుగా పాల్గొన్నారు.

17న యూత్ బాక్సింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా యువ, వర్ధమాన బాక్సింగ్ క్రీడాకారులకు తీపికబురు. ఈ నెల 17న జిల్లాస్థాయి యూత్ చాంపియన్‌షిప్ పోటీలతోపాటు రాష్ట్రపోటీలకు ఎంపికలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా బుధవారం ఉదయం 7 గంటలకు పోటీలు మొదలుకానున్నాయని బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ అనంతలక్ష్మణ్‌దేవ్(అను) తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19 నుంచి 21 వరకు విశాఖపట్నం వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. 2005 జనవరి ఒకటి నుంచి 2006 డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారు అర్హులని స్పష్టంచేశారు. 46 కేజీల నుంచి 92+కేజీల విభాగం వరకు 13 బరువు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 3 పాస్ ఫొటోలను తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9618905735, 8977496979 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాత్రి వేళల్లో పకడ్బందీగా గస్తీ : ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : రాత్రి వేళల్లో పకడ్బందీగా గస్తీ కాయాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. జిల్లా పోలీసు శాఖ అందిస్తున్న ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల సేవలు ప్రజలు వినియోగించుకోవాలన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆస్తి సంబంధిత నేరాలపై పోలీస్ స్టేషన్ల వారీగా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా వివిధ రకాల నేరాల సరళిని పరిశీలించి నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, నేరస్తులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో దొంగతనాలు చేసేవారు లాడ్జీల్లో స్టే చేసేందుకు వస్తుంటారని, లాడ్జీలను ఆకస్మిక తనిఖీ చేసి సీసీ కెమెరాలను పర్యవేక్షించి బస చేసే వ్యక్తుల పూర్తి వివరాలు, చిరునామాతో కూడిన గుర్తింపు కార్డు రిజిస్టర్లలో కచ్చితంగా పొందుపరిచే విధంగా లాడ్జి నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. అనుమానిత వ్యక్తులను వారి ఫింగర్ ప్రింట్ ద్వారా వెరిఫై చేసి వారు పాత నేరస్తులా కాదా అన్నది గుర్తించాలన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి స్వయంగా గస్తీలు నిర్వహిస్తూ నేరాలు జరగకుండా చూడాలని, డీఎస్పీలు, సీఐలు వారి వారి పరిధిలో గస్తీలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, సీసీఎస్ సీఐ వెంకటేశ్వరావు, డీసీఆర్బీ సీఐ పాల్గొన్నారు.

రాజీయే.. రాజమార్గం

- రాష్ట్రవ్యాప్తంగా మెగా లోక్ అదాలత్
- వివిధ కోర్టుల్లో 3,073 కేసుల పరిష్కారం



కౌన్సిలింగ్‌తో ఏకమైన దంపతులు

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రధాన న్యాయమూర్తి ప్రణబ్‌కుమార్ రౌత్రాయ్ శనివారం ప్రారంభించారు. ఆర్.ఉదయగిరిలో సీనియర్ సివిల్ జడ్జి పుణ్యష్లక రథ్, జేఎంఎఫ్‌సీ తరుణ్‌కుమార్ శెఠి, మోహానా కోర్టులో శుభాజిత్ బెహరా, కాశీనగర్‌లో అంకితా గురు(జేఎంఎఫ్‌సీ) పాల్గొన్నారు. మొత్తంగా ఒకే రోజులో 103 కేసులు పరిష్కారం అయ్యాయని కోర్టు రిజిస్ట్రార్ వెల్లడించారు. జరిమాన రూపంలో రూ.10,81,855లు వసూలు చేశామన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి శుభ్రత్ మహంతి, జిల్లా అదనపు జడ్జి ప్రదీప్ శామల్, సీనియర్ సివిల్ జడ్జి సంతోష్‌కుమార్ అగ్రవాలా, న్యాయసేవా ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా, ఎస్‌డీజేఎం వర్షా శర్మ పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బ్యాంకులు ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా తమ కార్యాలయాల్లో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కస్టమర్లతో వివిధ వివాదాలను పరిష్కరించుకున్నారు. స్టేట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ చక్రధర నాయక్ పర్యవేక్షించారు.

13 కేసుల్లో రాజీ..

రాయగడ: స్థానిక జిల్లా కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి విక్రంకేశరి పట్నాయక్, జిల్లా న్యాయసహాయ సంస్థ కార్యదర్శి నివేదిత పండా, ఫ్యామిలీ కోర్టు జడ్జి అమృత్‌రంజన్ నందా పాల్గొన్నారు. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న 13 కేసులను పరిష్కరించారు. ఈ క్రమంలో అపరాధ రుసుం కింద రూ.7.25 లక్షలను కక్షిదారుల నుంచి వసూలు చేశారు. అలాగే కుటుంబ కలహాల కారణంగా వేర్వేరుగా ఉంటున్న దంపతులకు కౌన్సిలింగ్ నిర్వహించిన ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి నందా.. వారిని తిరిగి కలిపారు.



లోక్ అదాలత్‌లో విచారణ చేస్తున్న న్యాయమూర్తులు

2,957 కేసుల పరిష్కారం..

జయపురం: జిల్లాలోని జయపురం, కొరాపుట్, కొట్‌పాడ్, బొరిగుమ్మ, లక్ష్మీపూర్, దసమంతపూర్, సెమిలిగుడ, లమతాపుట్ లోని వివిధ కోర్టులలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్రా ప్రారంభించారు. ఇందులో సివిల్, క్రిమినల్, మోటారు ప్రమాదాలు, బ్యాంకు రుణాలు, విద్యుత్, నీటి సరఫరా, కుటుంబ సంబంధిత, భూమి వివాదాలు, కార్మిక సంబంధిత, చెక్ బౌన్స్ తదితర 2,957 కేసులకు ఒకే రోజులో పరిష్కారమార్గం చూపామని కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రాధికరణ, జయపురం కార్యదర్శి సుమన్ జెనా వెల్లడించారు. కేసుల పరిష్కారంలో స్వతంత్ర విజిలెన్స్ జడ్జి రాజేష్ ఎక్కా, విజిలెన్స్ జిల్లా జడ్జి ఈ.విఘ్నేశ్వరరావు, ఫ్యామిలీ కోర్టు జడ్జి డాక్టర్ పవిత్రమోహన్ సామల్, జిల్లా అదనపు జడ్జి పీహెచ్ బాసుదేవ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.2 కోట్ల 3 లక్షలను అపరాధ రుసుంగా వసూలు చేసినట్లు కోర్టు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.



పర్లాకిమిడి: ఎస్‌బీఐలో అదాలత్ నిర్వహిస్తున్న మేనేజర్ చక్రధర



పర్లాకిమిడి: కోర్టులో కక్షిదారులను విచారిస్తున్న న్యాయమూర్తి రౌత్రాయ్

బ్యాంకు రుణం సొమ్ముతో పరారీ



ఎస్పీ కార్యాలయం ఆవరణలో బాధిత మహిళలు

- స్వయం సహాయక బృందానికి రూ.6 లక్షలకు ఎగవేసిన దంపతులు

రాయగడ: ఎస్‌హెచ్‌జీ(స్వయం సహాయక బృంద)లో చేరిన దంపతులు రూ.6 లక్షలు రుణం తీసుకుని, తిరిగి చెల్లించకుండా పరారైన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనిపై సంఘం మహిళలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో శనివారం జిల్లా పోలీసు సూపరింటిండెంట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎస్పీ వివేకానంద శర్మ అందుబాటులో లేకపోవడంతో ఎస్‌డీపీఓ దేవజ్యోతి దాస్ ఫిర్యాదును స్వీకరించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయాలని రాయగడ ఐఐసీ కమలాకాంత్ కుహూరొను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే... గంజాం జిల్లా గొముండి గ్రామానికి చెందిన రమేష్ సాహు, జున్ను సాహు రాయగడలోని మంకొడొజోల ప్రాంతంలో గత 10ఏళ్లుగా నివసిస్తున్నారు. చిరు వ్యాపారం చేస్తూ వీధిలోని వారితో కలసిమెలసి ఉంటుండేవారు. ఈ క్రమంలో మంకొడొజోలలో నివసిస్తున్న నళిని కుమారి సాహు, పులొమొతి జొడియాని, సంజు జాని, కమలా ముదులి, విమల జాని, లత కౌసల్య, బాసంతి ముదులి, సవితా జాని, కియామ జాని, ధనవతి జొడియా లతో కలిసి ఎస్‌హెచ్‌జీ గ్రూప్ ఏర్పాటు చేశారు.

పోలీసులు స్పందించక పోవడంతో..

స్వయం సహాయక బృందం ఆర్థిక స్వాలంబన కోసం బ్యాంక్ అధికారులు రుణాలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో సుమారు రూ.6 లక్షల రుణం వరకు తీసుకున్న రమేష్ సాహు, జున్ను సాహు తిరిగి డబ్బులు చెల్లించక పోవడంతో గుట్టు చప్పుడు కాకుండా పరారయ్యారు. అయితే గ్రూప్ పేరిట మంజూరైన రుణాలను తిరిగి చెల్లించాలని బ్యాంకు నుంచి మిగతా సభ్యులకు ఒత్తిడి రావడంతో వారంతా సమస్యల్లో చిక్కుకున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని తామంతా పరారైన దంపతులు చేసిన రుణాలను ఎలా చెల్లించాలని వాపోయారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని 4రోజుల క్రితం సదర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లామని తెలిపారు. స్థానిక పోలీసుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఎస్పీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చిందని వివరించారు. పరారైన వారిని గుర్తించి, తిరిగి డబ్బు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

మందుపాతర స్వాధీనం



ఐఈడీ బాంబును పేల్చివేస్తున్న దృశ్యం

- అనంతరం పేల్చివేసిన బీఎస్ఎఫ్ జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ-79 పోలీస్ స్టేషన్ పరిధి తేల్‌రాయి పంచాయతీ బీఎస్ఎఫ్ జవాన్లు శనివారం ఉదయం కూబింగ్ చేపట్టారు. ఇందులో భాగంగా బేజంగ్‌వాడ సమీపం సుధాకొండ-అమపాదర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంప్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 3కిలోల ఐఈడీ(టిఫిన్‌బాక్స్) బాంబు, డిటోనేటర్లు 12, 20మీటర్ల విద్యుత్ వైరు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. క్యాంప్‌కు తరలించిన అనంతరం బాంబును సురక్షితంగా పేల్చివేశారు. మావోయిస్టుల చర్యలను అణచివేసేందుకు బీఎస్ఎఫ్‌తో పాటు జిల్లా పోలీసులు కూడా సంయుక్తంగా కూబింగ్ చేపడుతున్నారని జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీ తెలిపారు.



అటవీ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న జవాన్

జయపురంలో రీజనల్ జుడీషియల్ అకాడమీ



జస్టిస్ సూర్యకాంత్‌కు స్వాగతం పలుకుతున్న జుడీషియల్ సిబ్బంది

- ప్రారంభించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

జయపురం: స్థానిక పట్టణంలోని కోర్టు ఆవరణలో కొరాపుట్ రీజనల్ జుడీషియల్ అకాడమీ కార్యాలయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శనివారం ప్రారంభించారు. ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఒడిశా జుడీషియల్ అకాడమీ చీఫ్ పేట్రన్, జస్టిస్ ఎస్.మురళీధర్ ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీజనల్ జుడీషియల్ అకాడమీ అవిభక్త కొరాపుట్, కలహండి జిల్లాల వారికి అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఇందులో అధికారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులకు వివిధ చట్టాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించవచ్చని తెలిపారు. గతంలో కటక్ లోనే ఈ అవకాశం ఉండేదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కోర్టులో 30 ఏళ్లకు పైగా సేవలందించిన 23మంది న్యాయశాఖ సిబ్బందిని న్యాయమూర్తి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో జుడీషియల్ అకాడమీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ బిద్యుత్‌రంజన్ షొడంగి, కమిటీ సభ్యులు జస్టిస్ వి.నర్సింహ, జస్టిస్ గౌరీశంకర శత్పతి, న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

దుబాయ్‌కి మిషన్‌శక్తి మహిళ



కుమారి పలకను అభినందిస్తున్న ప్రధాన్, బెహరా

రాయగడ: మిషన్ శక్తిలో పనిచేస్తున్న మహిళలను విదేశాలకు పంపి, అక్కడి మెలకువలను తెలుసుకోవడంతో పాటు వాటిని ఆచరణ రూపంలో పెట్టేందుకు రాష్ట్రప్రభుత్వం యోచించింది. ఈ క్రమంలో మిషన్‌శక్తి గ్రూప్‌లలో పనిచేసే రాష్ట్రానికి చెందిన 10మంది మహిళలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో రాయగడ జిల్లా నుంచి కుమారి పలకకు చోటు కల్పించారు. ఈనెల 15న ఆమె దుబాయ్ వెళ్లనున్న నేపథ్యంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ ప్రధాన్, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి యజ్ఞసేని బెహరా, సూపర్‌వైజర్ కామాక్షి పాఢి, నిరంజన్ మల్లిక్ తదితరులు అభినందించారు.

జర్నలిస్టులకు రూ.10 లక్షల బీమా



ఓజేయూ సభ్యులకు బీమా పాలసీలు అందిస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

జయపురం: ఒడిశా జర్నలిస్ట్ యూనియన్(ఓజేయూ)లో సభ్యులందరికీ రూ.10 లక్షల బీమా పథకం అమలు చేస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర సాధారణ కార్యదర్శి కె.శ్రీనివాసరావు వెల్లడించారు. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మలో ఒడిశా జర్నలిస్ట్ యూనియన్ కొరాపుట్ జిల్లాశాఖ సభ్యుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టులకు రక్షణ కల్పించడంతో పాటు రూ.10 లక్షల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పలువురు సభ్యులకు బీమా పాలసీ పత్రాలను అందజేశారు. సమావేశంలో వివిధ సమితులకు చెందని యూనియన్ సభ్యులు, కొరాపుట్ జిల్లాశాఖ అధ్యక్షుడు జయసింగ్ పాఢి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర మహాపాత్రో సునామీ హంతాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు క్రాంతి బెహరా, శ్యామ ఖిళో, సునీల్ షొడంగి, శుభనారాయణ మహంతి, కృష్ణ గౌలారి, సుశాంతకుమార్ పండా, సుదర్శన ప్రధాన్, రామచంద్ర నాయిక్, బొరిగుమ్మ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

కనిపెంచే దైవం



ఆకలైతే అమ్మ కావాలి. ఆపదొస్తే అమ్మ రావాలి. భయం వేస్తే అమ్మను తలవాలి. ఆనందమొచ్చినా అమ్మే ఉండాలి. హారంలో దారంలా సర్వకాల సర్వావస్థల్లోనూ అమ్మ ఉండి తీరాలి. నేడు మాతృ దినోత్సవం. వాట్సాప్ స్టేటస్‌లో అమ్మ డీపీలు, సోషల్ మీడియాలో అమ్మ కొటేషన్లు కోకొల్లలుగా కనిపించే రోజు. అమ్మ అడగదు గానీ ఆమెకూ ఓ రోజు సెలవుంటే బాగుంటుంది. ఇవ్వమనదు గానీ ఓ కానుకపై ఆమె పేరు రాసి ఇస్తే మురిసిపోతుంది. అందుకు మదర్స్‌డేను మించిన ముహూర్తం ఏముంటుంది..? ఇదిగో ఇక్కడ ఓ కుమారుడు అమ్మకు గుడి కడుతున్నాడు. ఓ కుమార్తె అమ్మకు గౌరవాన్ని తెచ్చిపెట్టింది.





చీమలవలస గ్రామంలో నిర్మిస్తున్న అమ్మ దేవస్థానం (ఇన్‌సెట్లో) తల్లి అనసూయాదేవి పేరుతో ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న శ్రావణ్‌కుమార్ (ఫైల్)

ఆమదాలవలస రూరల్:

ఆమదాలవలస మండలం చీమలవలస గ్రామానికి చెందిన సనపల శ్రావణ్‌కుమార్ తన తల్లి అనసూయదేవి జ్ఞాపకార్థం గుడి కడుతున్నారు. చీమలవలస గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో వివిధ వ్యాపారాలను చేసుకుంటున్నారు. శ్రావణ్‌కుమార్ తల్లి అనసూయదేవికి 2008లో అనారోగ్యం చేయడంతో శస్త్రచికిత్స చేస్తున్న సమయంలో మృతిచెందారు. తల్లి లేని లోటు శ్రావణ్‌కుమార్ జీవితంలో స్పష్టంగా తెలుస్తోంది. సమాజానికి సేవ చేసి మంచి పేరు తీసుకురావాలని తల్లి చెప్పడంతో ఆమె మాటలను గుర్తు చేసుకుని అహర్నిశలు శ్రమించి వ్యాపార రీత్యా బాగా స్థిరపడ్డారు. ఇప్పుడు అమ్మ పేరుతో గుడి నిర్మించాలని నిర్ణయించుకున్నారు. సొంత గ్రామం చీమలవలసలోనే రూ. 10 కోట్ల వ్యయంతో కృష్ణశిలతో అమ్మ దేవస్థానాన్ని నిర్మించడానికి నిర్ణయించుకుని 2019 మార్చి నెలలో దేవాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రాచీన కాల పద్ధతిలో కట్టాలని భావించి కృష్ణశిలతో దేవాలయాన్ని నిర్మిస్తే కలకాలం ఉంటుందని నిర్మాణాలు చేపడుతున్నారు. ఆగమశాస్త్రం ప్రకారం ఐదు గోపురాలతో గుడిని నిర్మిస్తున్నారు. ప్రధాన గోపురం 51 అడుగుల ఎత్తులో, మూలవిరాట్టుగా మాతృమూర్తి విగ్రహాన్ని, దేవాలయం చుట్టూ శిల్పకళ ఉట్టిపడేలా నిర్మాణాలు జరుపుతున్నారు. ప్రస్తుతం అమ్మ దేవస్థానం పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేసి అమ్మ దేవస్థానాన్ని మాతృమూర్తులందరికీ అంకితం చేస్తామని శ్రావణ్‌కుమార్ తెలిపారు.

దేవతకు ప్రతిరూపం



నవమాసాలు మోత
బిడ్డల వలన గుండె కోత
చీదరించినా చెరగని ఆప్యాయత
అనురాగాల పాలపోత
సహనం, ఓరిమి కలబోత
కరుణారుణ రక్తాన్ని క్షీర ధారగా
మార్చిన కరుణాంతరంగ
తాను చచ్చి మరో ప్రాణికి
జన్మనిచ్చిన కైవల్య గంగ.
వాత్సల్య లయల మృదుల మృదంగ.
ప్రేమాభిమాన మహోత్తుంగ తరంగ.
అమ్మ... అమ్మ... అమ్మ!

– కుప్పిలి వెంకటరాజారావు, రచయిత, తానా పురస్కార గ్రహీత, ఆమదాలవలస

బిడ్డ కల సాకారం

మాతృ దినోత్సవం

ఇచ్ఛాపురం రూరల్: భర్త లేడు.. ముగ్గురు కుమార్తెల భారం తలపైన ఉంది. కడుపు నింపడమే కష్టమైన పని. అలాంటిది ఒక బిడ్డ కల సాకారం చేయాలంటే ఆ తల్లికి తలకుమించిన భారమే. కానీ ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు బోర సావిత్రమ్మ. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి చెందిన బోర మాదయ్య, సావిత్రమ్మలు నిరుపేదలు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మాదయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లి సావిత్రమ్మ పైనే కుటుంబ భారం పడింది. తొలి ఇద్దరు అమ్మాయిలను చదివించలేకపోయిన ఆ తల్లి మూడో కుమార్తె త్రివేణిని బడిలో చేర్పించింది. త్రివేణి తెలివైన అమ్మాయి. ఎస్ఐ కావాలని ఎంతో తపించింది. కానీ తల్లి ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించలేదు. ఒకసారి చదువు అర్ధంతరంగా మానేయాల్సి వచ్చింది కూడా. అయినా ఆమె తన గమ్యాన్ని మార్చుకోలేదు. కూతురి ఇష్టాన్ని తెలుసుకున్న సావిత్రమ్మ రేయింబవళ్లు శ్రమించి కుమార్తెను చదివించింది. డిగ్రీ పూర్తి చేయించి, ఎస్ఐ కోచింగ్‌కు అవసరమైన సహాయ, సహకారాలు అందించింది. తల్లి కష్టాన్ని వమ్ము చేయని త్రివేణి 2019లో తెలంగాణలో ఎస్ఐ పరీక్షలో విజయం సాధించింది. ఏఆర్ ఎస్ఐగా రెండేళ్ల పాటు శిక్షణ పూర్తి చేసిన త్రివేణి ఇప్పుడు తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ సిటీ కమిషనరేట్‌లో రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఎప్పటికైనా తన కుమార్తె ఆంధ్రలో డీఎస్పీ హోదాలో పనిచేయాలన్నదే తన చిరకాల వాంఛ అని తల్లి చెబుతోంది.



తల్లి సావిత్రమ్మతో కుమార్తె ఎస్ఐ త్రివేణి

క్లుప్తంగా

మందుబాబుల చిందులపై విచారణ



దశుమంతపురం పాఠశాలలో విచారణ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

వీరఘట్టం: మండలంలోని దశుమంతపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రాత్రి మందుబాబులు చిందులు వేసి సరస్వతీ నిలయంలో అసాంఘిక కార్యక్రమాలతో పాఠశాల పరిసరాలను పాడు చేసినట్లు శనివారం పత్రికల్లో వచ్చిన కథనాలపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఎంఈఓ శ్రీనివాసరావు గ్రామానికి చేరుకుని సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, హెచ్.ఎం గంగారావు, పేరెంట్స్ కమిటీ, మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ మహిళలను శనివారం విచారించారు. అసలేం జరిగిందని ఆరా తీశారు. అందరి వద్ద స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. సంబంధిత నివేదికను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించి తదుపరి చర్యలు చేపడతామని ఎంఈఓ తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్



మద్యం సీసాలతో పట్టుబడిన వ్యక్తితో ఎస్‌ఐ, హెచ్‌సీలు

తెర్లాం: ఎటువంటి అనుమతి లేకుండా 107మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ ఆర్.రమేష్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు మండలంలో మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించామని తెలిపారు. దాడుల్లో మండలంలోని నందిగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 107 మద్యం సీసాలు ఉండగా అతనిని పట్టుకున్నామన్నారు. అతని వద్ద ఉన్న 107 మద్యం సీసాలను సీజ్ చేసి ఆ వ్యక్తిని అరెస్ట్ చేశామని, తదుపరి చర్యల నిమిత్తం బొబ్బిలి కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆయనతో పాటు హెచ్‌సీలు రాజు, ప్రసాదరావు ఉన్నారు.

కుక్కల దాడిలో 9 మేకల మృతి



కుక్కలు దాడిలో మృతి చెందిన మేకలు

సీతానగరం: మండలంలోని చినబోగిలిలో మేకలపై కుక్కలు శనివారం దాడి చేసిన ఘటనలో మేకలు మృతి చెందాయి. కంచెతో ఉన్న మేకలశాలలో కుక్కలు చొరబడి తొమ్మిది మేకలను హతమార్చాయని యజమాని జాన తౌడు తెలిపారు. తాము ఇంట్లో లేని సమయంలో శాలలోకి ప్రవేశించిన కుక్కలు దాడి చేశాయని బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కె.రాధ, ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీతో పాటు పలువురు జాన తౌడు కుటుంబాన్ని పరామర్శించారు.

అమ్మ మందలించిందని...



చికిత్స పొందుతున్న మాధురి

పార్వతీపురం: అమ్మ మందలించిందని కుమార్తె మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... పార్వతీపురం మండలం చల్లంవలస గ్రామానికి చెందిన బి.మాధురి తన అమ్మ వరలక్ష్మి మందలించిందని ఇంట్లో వున్న థైరాయిడ్‌కు వాడే 15 మాత్రలను ఒక్కసారిగా మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీన్ని గమనించిన తల్లి చుట్టుపక్కల వారికి పిలిచి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: ఎన్టీఆర్ శత జయంతి పురస్కరించుకుని ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న జాతీయ పురస్కారాలను అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఐఎస్ఎస్.నారాయణ శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, ఆధ్యాత్మిక, వ్యవసాయం, నాటక రంగంలో సేవలందిస్తున్న వారందరూ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9652347207 నంబరును సంప్రదించాలని కోరారు.

ప్రేమకు ప్రతిరూపం అమ్మ



అమ్మంటే ప్రేమకు ప్రతిరూపం. అమ్మను మించిన దైవం లేదంటారు. తల్లే పిల్లల ప్రపంచం. వారి ఎదుగుదలే అమ్మ ఆశయం. ఒక్క మాటలో చెప్పాలంటే సమాజ నిర్మాణంలో అమ్మ పాత్ర అనిర్వచనీయమైంది. కష్టాలను తన కళ్లల్లో దాచేస్తూ పైకి చిరునవ్వులు చిందించే అమ్మతనాన్ని ఎంత వర్ణించినా తక్కువే. బిడ్డలను కంటికి రెప్పలా కాపాడే అమ్మను ఆది గురువు అంటారందుకే....పిల్లల కోసం తన జీవితాన్ని ధారపోసి వారి కష్టాలను తన కష్టంగా భావించి లాలించే అమ్మను కాపాడడం ప్రతి ఒక్కరి ధర్మం. - సాక్షి నెట్‌వర్క్

అమ్మ ప్రోత్సాహం మరువలేనిది



అమ్మ గీతాదేవితో కలెక్టర్ నిషాంత్‌కుమార్

ఐఏఎస్ కావడానికి అమ్మ గీతాదేవి ప్రోత్సాహం మరువలేనిది. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఐఏఎస్‌గా ఎంపికైన కలెక్టర్ నిషాంత్‌కుమార్ రాజస్థాన్‌లోని పాళీ జిల్లాలోని ఓ కుగ్రామంలో పుట్టి పెరిగారు. అమ్మానాన్నలకు చిన్నతనంలోనే వివాహం కావడంతో వారు చదువుకు దూరమయ్యారు. అయినప్పటికీ చదువుపై మమకారంతో నాన్న చదివి తొలుత పోస్టు అండ్ టెలిగ్రాఫ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా లా డిగ్రీ పూర్తి చేసి జడ్జిగా ఎంపికయ్యారు. పాఠశాలకు దూరమైన తల్లి ఇంట్లోనే చదువుకొని మాకు స్ఫూర్తిదాతగా నిలిచారు. మా అమ్మా నాన్నలకు ఐదుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సోదరుడు, ఒక సోదరి జడ్జిలుగాను, ఒక సోదరి రాజస్థాన్ రాష్ట్ర గ్రూపు - 1 అధికారిగా, మరో సోదరి ప్రొఫెసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. తామంతా ఉన్నత పదవుల్లో ఉండటానికి తల్లి గీతాదేవి పాత్ర ఎంతో కీలకం. అమ్మే మాకు మార్గదర్శకం. నా ఉన్నతిలో అమ్మ అపురూప మార్గదర్శత్వం మరువరానిది. - నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

తనయుని సేవలో మాతృమూర్తి



బాలుడి సేవలో తల్లి కుమారి

ఈ చిత్రంలోని బాలుడు సీతంపేట ఏజెన్సీ మెట్టుగూడ గ్రామానికి చెందిన సవర ప్రవీణ్. వయసు 15 సంవత్సరాలు. చిన్నమంగయ్య, కుమారి దంపతుల రెండో కుమారుడు. పుట్టినప్పటి నుంచే నరాల బలహీనతతో రెండు కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. మంచంపై లేవలేని స్థితిలో ఉన్న కుమారుడికి సేవలు చేస్తూ తన జీవితాన్ని ధారబోస్తోంది. కూలీ పనులకు వెళ్తేగాని పూట గడవని స్థితిలో కడుపున పుట్టిన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. - సీతంపేట

అన్నీ తానై..



మానసిక దివ్యాంగురాలు మహాలక్ష్మి సేవలో తల్లి పొన్నమ్మ

ఈ చిత్రంలో కనిపిస్తున్న పాప పేరు వసంతల మహాలక్ష్మి. రామభద్రపురంలోని వసంతల వీధిలో ఉంటున్న ఈమె మానసిక దివ్యాంగురాలు. తండ్రి లేడు. తల్లి వసంతల పొన్నమ్మ వ్యవసాయ కూలీగా ఉంటూ మహాలక్ష్మికి అన్నీ తానై ఉంటూ జీవితాన్ని త్యాగం చేస్తోంది. కుమార్తె పరిస్థితిని చూసి క్షణక్షణం తల్లడిల్లుతూనే కన్నీటిపర్యంతమవుతూనే తన కర్తవ్యాన్ని నిర్వహిస్తోంది. - రామభద్రపురం

కదల్లేని స్థితిలో...

మాతృ దినోత్సవం

ఈ చిత్రంలోని మానసిక దివ్యాంగుడి పేరు మామిడి రామకృష్ణ. రామభద్రపురంలోని పొందూరు వీధిలో నివాసం ఉంటున్నాడు. 22 సంవత్సరాలుగా రామకృష్ణ తల్లి సరోజని మీదే ఆధారపడుతూ తన జీవన యానాన్ని సాగిస్తున్నాడు. కూలీ పనులకు వెళ్తేగాని పూట గడవని పరిస్థితుల్లో తల్లి తన బిడ్డ కోసం సర్వం ధారబోస్తోంది. - రామభద్రపురం



కదల్లేని స్థితిలో ఉన్న మామిడి రామకృష్ణ సేవలో తల్లి సరోజని

అమ్మే...అంతా...



కొట్టక్కిలో ఉదయ్‌కు సేవలు చేస్తున్న తల్లి తులసి

ఈ చిత్రంలోని మాదేన ఉదయ్ కొట్టక్కి గ్రామానికి చెందినవాడు. 15 సంవత్సరాలుగా మస్తిష్క పక్షవాతంతో లేవలేని స్థితిలో జీవిస్తున్నాడు. తల్లి తులసి అన్నీ తానై బిడ్డకు సేవలు చేస్తూ జీవిస్తోంది. భవిత కేంద్రంలో ఓ వైపు పని చేస్తూ మరోవైపు బిడ్డను సాకుతూ అష్టకష్టాలు పడుతూ జీవనాన్ని సాగిస్తోంది. - రామభద్రపురం

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్‌అండ్‌బీ జంక్షన్ చేపల మార్కెట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, రక్త సంబంధీకులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పది రోజుల్లోనే సీఎం సాయం

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తన కష్టం చెప్పుకున్న పది రోజుల్లోనే సీఎం నుంచి సాయం అందింది. దీంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేవు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పేరిపి గ్రామానికి చెందిన యలకల అనసూర్య ఈ నెల 3న భోగాపురం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలీప్యాడ్ వద్ద కలిసింది. తనకున్న ఆరోగ్య సమస్యను వివరించింది. పేద కుటుంబానికి చెందిన తాను ఆరోగ్యం బాగు చేసుకునేందుకు ఆర్థిక సహకారం అందించాలని కోరింది. అనసూర్య కష్టాలు విన్న ముఖ్యమంత్రి స్పందించారు. పది రోజుల్లోనే రూ.లక్ష చెక్‌ను పంపించారు. దీంతో చీపురుపల్లిలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఆ చెక్‌ను అనసూర్యకు శనివారం అందజేశారు.పది రోజుల్లోనే తనకు సాయం అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అనసూర్య కృతజ్ఞతలు తెలిపింది. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పేరిపి సర్పంచ్ కోరాడ పృధ్వీ, తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మరుపల్లి రోడ్డుపై గణేష్ మృతదేహం

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున రోడ్డుపై గుర్తు తెలియని యువకుడు మృతి చెంది ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. తొలిత గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉంటాడని భావించిన పోలీసులు తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సీఐ లెంక అప్పలనాయుడు తెలిపిన వివరాలు.. రామభద్రపురం మండలం పాతరేగ గ్రామానికి చెందిన పెద్దింటి గణేష్(25) శనివారం తెల్లవారుజామున మరుపల్లి సమీపంలో రోడ్డుపై మృతి చెంది ఉండడాన్ని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీనిపై స్పందించిన తల్లిదండ్రులు తమ కుమారుడు విజయనగరంలోని ఐసీఐసీఐ బ్యాంకులో విధులు నిర్వహిస్తున్నాడని, గ్రామానికి వచ్చేటపుడు తప్పని సరిగా తమకు ఫోన్ చేసి వచ్చేవాడని తెలిపారు. షార్ట్, బనియన్‌తో ఇంటికి వచ్చేవాడు కాదని, ప్రస్తుతం తమ కుమారుడు ఒంటిపై షార్ట్, బనియన్‌తో ఉన్నాడని, మెడపై గాయాలు కూడా ఉన్నాయని రోదించారు. తమ కుమారుడిని ఎవరో హత్య చేశారని అనుమానం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పెద్దింటి చిన్నంనాయుడు, కృష్ణమ్మ కుమారుడు మృతిపై అనుమానం వ్యక్తం చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ శివారు పూల్‌బాగ్ కాలనీలో నివాసం ఉంటున్న శిరువూరి సుధీర్ వర్మ (29) ఆర్థిక సమస్యలు తాళలేక ఈ నెల 9న ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యు లు వెంటనే అతన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈయనకు భార్య, ఒక బాబు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ శంకర్ తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన మద్దిల శివ జ్ఞాపకార్థం ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పెద్దలు, 2010-11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చినబూరాడపేట గ్రామ సచివాలయంలో జేఎల్‌ఎంగా విధులు నిర్వహిస్తూ ఈ నెల 5న శివ మృతి చెందిన విషయం తెలిసిందే. 2003 నుంచి ఇప్పటివరకు శివ 17 సార్లు రక్తదానం చేశారని స్నేహితులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన జ్ఞాపకార్థం రావిచెట్టు వీధిలోని నల్లి సూరిబాబు కళావేదిక వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ పి.నారాయణరావు అందించిన వివరాలు.. జరజాపుపేటకు చెందిన కిల్లంపల్లి సన్నిబాబు(72) గత నెల 13వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం బంధువులు ఆయనను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఆర్మీ కల్యాణి ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మద్యపానం అలవాటున్న సన్నిబాబు పొరపాటున పురుగులు మందు సేవించినట్లు ఆయన భార్య ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య ఆదిలక్ష్మితో పాటు నలుగురు పిల్లలున్నారు.



కిల్లంపల్లి సన్నిబాబు(ఫైల్)

వివాహిత ఆత్మహత్యా యత్నం

పార్వతీపురం: చీమల మందు తాగి ఓ యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... సీతానగరం మండలం గెడ్డలుప్పి గ్రామానికి చెందిన ఆర్.గౌరీశ్వరి, భర్త రవి ఇంట్లో గొడవ పడ్డారు. గొడవ పడుతున్న సమయంలో తోటికోడలు ఆర్.సత్యవతి, కుమారుడు దినేష్ కలుగజేసుకొని మా చిన్నాన్నను ఎందుకు బాధపెడతావని గౌరీశ్వరిపై దాడి చేశారు. భర్త పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురైన గౌరీశ్వరి ఇంట్లో వున్న చీమల మందును తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ మేరకు భర్త రవి 108 వాహనం ద్వారా చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.



చికిత్స పొందుతున్న గౌరీశ్వరి

యోగాతో ఆరోగ్యం

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా, గీతం విశ్వవిద్యాలయం సౌజన్యంతో యోగా ఆవశ్యకతపై శనివారం నిర్వహించిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగా చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సంస్థలు, పాఠశాలల నుంచి సుమారు వెయ్యిమంది యోగాసనాలు వేశారు. - విజయనగరం

ఆరోగ్య యోగం



యోగాసనాల సాధన



యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

విజయనగరం: సామరస్య జీవన విధానంలో యోగా ప్రాముఖ్యతను, ఆవశ్యకతను తెలియజేయడంలో భాగంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా, గీతం విశ్వవిద్యాలయం సౌజన్యంతో విజయనగరం కోటలో శనివారం నిర్వహించిన సామూహిక యోగాసన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని(జూన్ 21)ను పురస్కరించుకుని 100 రోజుల కౌంట్‌డౌన్ ప్రక్రియలో భాగంగా చారిత్రాత్మక కట్టడమైన విజయనగరం కోటలో యోగాసన ప్రక్రియను చేపట్టారు. విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు సుమారు 1,000 మంది పాల్గొని యోగా గురువుల సమక్షంలో ఆసనాలు సాధన చేశారు. యోగా ఫర్ హార్మోనియస్ లివింగ్ థీమ్‌తో చేపట్టిన కార్యక్రమం విజయవంతంగా సాగింది.



గీతం యూనివర్సిటీ అప్లైయిడ్ సైకాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ కె.సునీత యోగా ప్రాశస్త్యాన్ని, ప్రయోజనాలను వివరించారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారయ్యేందుకు యోగా దోహదపడుతుందన్నారు. యోగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో విజయనగరం, విశాఖపట్నం నగరాలను మాత్రమే ఎంపిక చేసినట్టు వెల్లడించారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్టు అధ్యక్షుడు టి.ఎల్.నరసింహారావు, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.నళిని, ఎం.ఆర్. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యకాంతి, పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనందబాబు, సత్య గ్రూపు విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు యోగా ప్రయోజనాలను వివరించారు. జిల్లాకు చెందిన అధికారులు, మాన్సాస్ ట్రస్ట్, యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్, బుద్ధ యోగా ఫౌండేషన్, ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సీతం, రఘు, లెండి ఇంజినీరింగ్ కాలేజీలు, రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు, పోలీస్ ట్రైనింగ్ కళాశాల శిక్షకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన వైద్యం



వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడలో వివాహ విందులో ఆహారం కలుషితం కావడంతో అస్వస్థతకు గురైన బాధితులకు సకాలంలో వైద్యం అందడంతో అందరూ కోలుకున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వెల్లడించారు. కొవ్వాడ గ్రామంలో వైద్య శిబిరాన్ని శనివారం సందర్శించారు. గ్రామంలో ఏ ఒక్కరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఇప్పటికే మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో శానిటేషన్ వర్కర్లుతో గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించినట్టు తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు వైద్యులు పర్యవేక్షణలో శిబిరం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ప్రజలంతా కోలుకొనే వరకు వైద్యశాఖ అధికారులు గ్రామంలో ఉంటూ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కొవ్వాడ గ్రామంలో అస్వస్థతకు గురైన సుమారు 500 మంది వరకు ప్రజలకు వైద్యసేవలు అందడంతో కోలుకుంటున్నారని తెలిపారు. ఆహారం వికటించడంతో అస్వస్థతకు గురైన బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్న వైద్య సిబ్బందికి, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు గ్రామ సర్పంచ్ కోట్ల రఘు, ప్రజాప్రతినిధి మహంతి శ్రీనివాసురావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసురావు, గోవిందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.త్రినాధరావుతో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

మాదకద్రవ్యాలు రవాణా చేస్తే చర్యలు

• ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాలు రవాణా చేస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి. మధుకుమార్ అన్నారు. పట్టణంలోని వై జంక్షన్ వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి, తదితర డ్రగ్స్ వంటి నిషేధిత పదార్థాలు రవాణా జరగకుండా నిరోధించేందుకు వాహన తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. తనిఖీలకు వాహనదారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా చేయడం వలన కలిగే అనర్థాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి వంటివి రవాణా చేస్తే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



జీసీకాలనీ రోడ్డును పరిశీలిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజు, తదితరులు

• జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజు

విజయనగరం రూరల్: పంచాయతీ పాలకవర్గమంతా సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విజయనగరం మండలంలోని సారిక గ్రామాన్ని డీపీఓ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ, సర్పంచ్, వార్డు సభ్యులకు మధ్య ఏమైనా సమస్యలుంటే సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, రోడ్ల మరమ్మతులు, తదితర వాటిని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, పంచాయతీ విస్తరణాధికారి తిరుపతినాయుడు, సర్పంచ్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.